కూటమి పాలనలో ఒరిగిందేమీ లేదు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని జె.అన్నవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పాలన అంతా ప్రచారానికి పరిమితం అయిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, బి.గోవింద్, ఎస్.రాంబాబు, సామంతుల సూర్యకుమార్, గొల్లపల్లి సురేష్, జువ్విన వీరరాజు, గుమ్ములూరి వెంకటరమణ, కె.వెంకటేశ్వరరావు, పైల విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పట్టింపు ఏదీ?

- మల్లం దళితుల సమస్యలపై స్పందన కరువు
- యథేచ్ఛగా మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు
- పంపకాల్లో రోడ్డెక్కిన జన సైనికులు
- ఏడాది పాలనలో ప్రజాసమస్యలు పక్కదారి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలోనే కాకుండా కూటమి ప్రభుత్వంలోనూ మహిళలు, దళితులపై దాడులు, అవమానాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వైసిపి పాలనలో తీవ్రస్థాయిలో విమర్శించిన చంద్రబాబు ప్రస్తుతం దళితులకు తరచూ అవమానాలు జరుగుతున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని మల్లం గ్రామంలో దళితులకు అవమానం జరిగినా ప్రభుత్వం స్పందించలేదు.

మల్లాం గ్రామంలో విద్యుత్ షాక్‌తో పి.సురేష్ అనే ఒక దళిత యువకుడు అక్కడికక్కడే మరణించాడు. పేద వర్గానికి చెందిన అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేష్ మృతితో వారి కుటుంబం వీధిన పడింది. కుటుంబాన్ని ఆదుకునే వారు కరువయ్యారు. పిల్లల చదువులపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో అనాధలుగా మారిన వారిని ఆదుకోవాలని కోరుతూ ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ నేపథ్యంలో ఒక సామాజిక వర్గానికి చెందిన కుటుంబం నుంచి బాధిత కుటుంబానికి కొంత మొత్తంలో పరిహారం అందింది. దీనిని దృష్టిలో పెట్టుకుని కొందరు గ్రామ పెత్తందారులు దళితులను గ్రామ బహిష్కరణ చేశారు. దళితులు పనులకు పిలవొద్దని, హోటళ్లలో టిఫిన్, టీ, పాలకేంద్రంలో పాలు, కిరాణా దుకాణాల్లో నిత్యావసర సరుకులు విక్రయించరాదని నిర్ణయించారు. దళితుల ఐక్యతను, వారి హక్కులను కాలరాసే కుట్రలు పన్నారు. దీంతో దళితుల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తం అయింది. గ్రామ బహిష్కరణపై అధికారులకు ఫిర్యాదు చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు దాటుతున్నా దళితులపై నేటికీ వివక్షత కొనసాగుతూ ఉండటం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కాకినాడ ఆర్‌డిఒ, పోలీసులు ఇరువర్గాలతో చర్చలు జరిపి శాంతి కమిటీని వేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వ్యక్తం అయ్యాయి. రాష్ట్రమంతా చర్చించుకునేలా గ్రామ బహిష్కరణ జరిగితే ప్రభుత్వం పెత్తందారులపై కుంటూ, ఎటువంటి కేసులు నమోదు చేయకుండా, చర్యలకు ప్రయత్నం చేయకుండా, శాంతి కమిటీని వేసి మిన్నకుండిపోవడంతో తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తం అయింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక దళిత సంఘాలు ఆందోళనలు చేశాయి.

పిఠాపురం మండలం ఫక్రుద్దీన్‌పాలెం పాపిడి దొడ్డి చెరువులో వివాదానికి కారణమైన మట్టి తవ్వకాలు

సుమోటోగా కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. స్వయానా రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో దళితుల గ్రామ బహిష్కరణ అంశం పెద్ద దుమారాన్ని రేపింది. కానీ ప్రభుత్వ పెద్దలు గ్రామాన్ని సందర్శించడం గానీ, దళితులకు ధైర్యం చెప్పడం గానీ, గ్రామ బహిష్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి గానీ ఉపక్రమించకపోవడంతో పాలకులపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.

అక్రమ మట్టి తవ్వకాలకు ప్రోత్సాహం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సైతం ఈ జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రధానంగా ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లో నిత్యం వందలాది లారీలు మట్టి అక్రమ రవాణా సాగిస్తున్నాయి. ప్రభుత్వ పెద్దల అండ దండలతోనే కొందరు అక్రమ మట్టి వ్యాపారులు పెద్ద ఎత్తున జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ, పైగా వెనక ఉండి ప్రోత్సహిస్తున్నారు అంటూ ఆరోపణలు ఉన్నాయి. పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం ఇస్తున్న పిఠాపురంలో అయితే మట్టి మాఫియా తీవ్ర స్థాయిలో రెచ్చిపోతుంది.

గత ప్రభుత్వ హయాంలో జల్లూరు, తాటిపర్తి, చేబ్రోలు చెరువుల నుంచి మట్టి మొత్తం తవ్వుకు పోతున్నారని ఒక్కో లారీకు రూ. 6 వేలు వరకు దోచేస్తున్నారని, గత వైసిపిలో చక్రం తిప్పిన మాఫియా డాన్ ఈ వ్యవహారం చక్కబెడుతున్నారని, మన మట్టి ఉచితంగా తీసుకెళ్తూ గ్రావెల్ కావాలంటే డబ్బులు చెల్లించాల్సి వస్తుందంటూ ఎన్నికల ప్రచార సభల్లో పవన్ కల్యాణ్ పెద్ద ఎత్తున మట్టి మాఫియాపై విరుచుకుపడ్డారు. యు.కొత్తపల్లి మండలంలో బొండు ఇసుక అక్రమ వ్యాపారంపైనా ఆయన ధ్వజమెత్తారు. నిబంధనలను అతిక్రమించి తవ్వకాలు జరుపుకున్నారంటూ విమర్శలు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఇటువంటివి ప్రోత్సహించమని చెప్పుకొచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక మట్టి అక్రమ తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పిఠాపురం మండలం ఫక్రుద్దీన్‌పాలెం గ్రామంలో రైతులు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నా ఇటుకుల బట్టీ వ్యాపారుల ప్రయోజనాల కోసం పెద్దఎత్తున మట్టి అక్రమ తవ్వకాలు జరిపారు. ఒక రైతు పేరుతో అనుమతులు తీసుకుని నిబంధనలను అతిక్రమించి వందల లారీల మట్టిని తరలించిపోయారు. దీనిపై జనసేన నేతల్లో ఆధిపత్య పోరు సాగింది. వాటాల పంపకాలలో తేడాలు రావడంతో రెండు వర్గాలుగా విడిపోయి రోడ్డెక్కారు. ఒకరికొకరు దాడి చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో రెండు వర్గాల పైనా కేసులు నమోదు వరకు ఈ వ్యవహారం వెళ్ళింది. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకుని చివరకు మట్టి తవ్వకాలను నిలిపివేయాలని ఆదేశించారు. మరోవైపు యు.కొత్తపల్లి మండలంలో బొండు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అక్కడికి వెళ్లి పరిశీలించి వ్యతిరేకించడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది. దీంతో బొండు ఇసుక తవ్వకాలను సైతం అధికారులు నిలిపి వేయించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎద్దేవా చేస్తూ అధికారంలోకి వచ్చిన కూటమి పెద్దలు మళ్లీ అవే తప్పులు చేస్తుండడంపై ఆయా నియోజకవర్గాల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. వైసిపికి, కూటమి ప్రభుత్వానికి పెద్దగా తేడా కనిపించడం లేదంటూ విమర్శిస్తున్నారు.

పెద్దాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

36వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

తమ సమస్యల పరిష్కారం కోసం ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 36వ రోజుకు చేరుకుంది. పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో సంఘ అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 36 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే తమ సమస్యలను సానుభూతితో పరిశీలించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బాసిన భద్రరావు, మహాపాతిన అరుణ్‌కుమార్, ఎస్‌కె.బషీర్, కె.వెంకటరమణ, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, పి.ప్రశాంత్, ఎన్.సూర్యప్రకాష్, అయ్యప్పస్వామి, ఒ.సోనియా, తదితరులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరంలో సంఘ నాయకులు మాట్లాడారు. తమ డిమాండ్లపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కొండవీటి రామరాజు, ఉపాధ్యక్షులు కృష్ణ, నాయకులు మేడిపోయిన రమణ, రత్నరాజు, రమేష్, కురుకూరి మురళీకృష్ణ, చిక్కాల నాగార్జున, ఉండవల్లి రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయవాదికి సన్మానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఎస్‌సి, ఎస్‌టి నిరుపేద సమస్యల పరిష్కారానికి హైకోర్టులో పోరాడుతున్న ప్రముఖ న్యాయవాది ఎం.చలపతిని సిపిఎం, సిపిఐ ఎంఎల్ (వినోద్ మిశ్రా) పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. బుధవారం లింగంపర్తిలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోసిరెడ్డి గణేష్ మాట్లాడుతూ భూస్వాములు, దళారులు చేతుల్లో ఆక్రమణలకు గురైన వందలాది ఎకరాలను పేదలకు అందేలా హైకోర్టులో పోరాడి ఆర్డర్లు తెచ్చిన ఘనత న్యాయవాది చలపతిదేనని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు మాట్లాడుతూ ఫీజులు కోసం కాకుండా న్యాయం కోసం పనిచేస్తున్న అతి తక్కువ మంది న్యాయవాదుల్లో చలపతి ఒకరిని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చలపతిని నాగార్జున యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యునిగా నియమించి గౌరవించిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రెడ్డి ఆనందపాల్, మహిళా నాయకురాలు గండేటి నాగమణి, జై భీమ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు, న్యాయవాది గండేటి కిషోర్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాది చలపతిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రకతి వ్యవసాయాన్ని సమాజానికి ఎంతో మేలు చేస్తుందని విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. బుధవారం ఎరువాక పౌర్ణమి పర్వది నాన్ని పురస్కరించుకుని నూతన ఆశ్రమ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతిని ఆరాధిస్తూ, ప్రకృతిలో ఉండే పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ, సేంద్రీయ ప్రకృతి పద్ధతుల ద్వారా మానవుడు తన మనుగడకు కావలసిన ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను సాధించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతులు డి.వెంకన్న, డి.సూరిబాబు, వై.చంద్రావతి, డి.పెద్దనాగేశ్వరరావు, జి.వీరభద్ర రావులను ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త నడింపల్లి రామగోపాలవర్మ డ్రోన్లతో వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అంబాజీపేట హార్టికల్చర్ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బివి.చలపతి వివిధ పంటలలో జీవ నియంత్రణ పద్ధతులను వివరించారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు వి.సత్యనారాయణమూర్తి, జి.సుభాష్, కె.పృథ్వీరాజ్, పి.శశికాంత్, ఎ. మల్లికార్జునరావు, జివి.కృష్ణంరాజు ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడారు. అతిథులను పీఠాధిపతి ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఠం సభ్యులు ఎవివి.సత్యనారాయణ, ఎన్‌టివి వర్మ, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, అహ్మద్ ఆలీషా, హుస్సేన్ షా, మీడియా కన్వీనర్ ఎ.రవితేజ, కె.అప్పలస్వామి పాల్గొన్నారు.

ఏరువాక కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఠాధిపతి ఉమర్ అలీషా

నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి

జగ్గంపేట నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులను ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం ప్రారంభించారు. జగ్గంపేట పంచాయితీ రాజ్ అతిథిగృహం వద్ద కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా పరిష్కారం కానీ సమస్యలకు ఈ ఏడాది కాలంలో నిధులు తెచ్చి పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, కూటమి పార్టీల నాయకులు తుమ్మలపల్లి రమేష్, దాట్ల కృష్ణవర్మ, పంచాయితీ రాజ్ డిఇ ఉమాశంకర్, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి సూర్యభాస్కరరావు పాల్గొన్నారు. అనంతరం గండేపల్లి గ్రామంలో ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా మండలంలో చేపట్టిన అభివృద్ధికి సంబంధించిన శిలాఫలకాన్ని ఎంఎల్‌ఎ జ్యోతుల ఆవిష్కరించారు. టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండలంలోని జెడ్ రాగంపేటలో రూ.6.50 కోట్లతో నిర్మించిన సిహెచ్‌సిని ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ రిబ్బన్ కట్ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి తోట రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, వైద్యులు డాక్టర్ స్వప్న, డాక్టర్ ప్రణీత్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే కిర్లంపూడిలోని సత్యదేవా కళ్యాణ మండపం వద్ద ఏడాది కాలంలో మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పైలాన్‌ను ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలత, ఉప సర్పంచ్ గౌతు జగన్నాథరావు, ఎంపిడిఒ హరికృష్ణ, తహశీల్దార్ జె.చిరంజీవి, పంచాయతీరాజ్ డిఇ ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి ,ఎంఎల్‌ఎ

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - సామర్లకోట

సంస్థాగత ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధులు కావాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బోళ్ల వెంకటరమణ పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థాగత ఎన్నికల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కష్టించి పార్టీ కోసం పనిచేసే నాయకులను, కార్యకర్తలకు మాత్రమే గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా అన్ని వర్గాలవారికి, ముఖ్యంగా మహిళలు, యువతకు కమిటీలలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, నూనె రామారావు, బడుగు శ్రీకాంత్, బొందల రామలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

చేబ్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో కొన్ని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డిఎస్‌ఎస్ పథకంలో నూతన విద్యుత్ లైన్లు నిర్మాణం చేయనున్నందున చెందుర్తి, వన్నెపూడి, కొడవలి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మున్సిపల్ ఎఇగా సుధాకర్

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పివి.సుధాకర్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎఇగా పనిచేసిన కృష్ణజీవప్రసాద్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ముమ్మిడివరం ఎఇగా పనిచేస్తున్న సుధాకర్ బదిలీపై వచ్చారు.

నేడు పిఠాపురంలో యోగాంధ్ర కార్యక్రమం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక పాడా కార్యాలయం సమీపంలో ఉన్న మున్సిపల్ హైస్కూల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాకు విస్తృత ప్రాచుర్యం కల్పించే లక్ష్యంతో గురువారం ఉదయం 6.30 గంటలకు యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

డ్రెయినేజీల అభివృద్ధిలో రైతులు కీలకం

ప్రజాశక్తి - కాజులూరు

డ్రెయినేజీల అభివృద్ధిలో రైతులు సహకారం కీలకమని ఈస్టర్న్ డెల్టా సాగునీటి పంపిణీ సంఘం అధ్యక్షులు మురారిశెట్టి సునీల కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని దుగ్గుదుర్రు గ్రామంలోని అంద్రంగి డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తూటును తొలగించే ప్రక్రియను డ్రోన్స్ సాయంతో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు డ్రెయిన్‌లపై ఉన్న అరటి చెట్లు, తదితర మొక్కలకు సంబంధించి ఫలాసాయం తీసుకున్న అనంతరం డ్రెయిన్‌లో వేయడం వల్ల నీరు పారక నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు నీటి సంఘాల అధ్యక్షులు ఎల్.కృష్ణచైతన్య, డి.విజయగోపాలరాజు, వై.సత్యనారాయణ, ఆర్.వెంకటరమణ, మాజీ అధ్యక్షులు వై.వెంకటరమణ పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక సుందరయ్య భవనంలో 10 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా పెన్షనర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాజ్‌కుమార్, దళిత నాయకుడు డేవిడ్, సిఐటియు నగర నాయకులు మేడిశెట్టి వెంకటరమణ పాల్గొని మాట్లాడారు. సమ్మర్ క్యాంప్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడిందని అన్నారు. ఈ క్యాంపు ద్వారా విద్యార్థులు డ్రాయింగ్, పద్యాలు, డాన్స్, బొమ్మలు తయారుచేయడం, కరాటే వంటివి నేర్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ నిర్వాహకులు సిహెచ్.వేణి, ఎం.నాగలక్ష్మి, టి.రాణి, మలకా వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులతో క్యాంపు నిర్వాహకులు

కార్టూ'నిజం'



రిఫరల్‌లో క్రమశిక్షణతో కూడిన విద్య

ప్రజాశక్తి - శంఖవరం

గ్రామీణ ప్రాంతంలో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తుందని కత్తిపూడిలోని రిఫరల్ పాఠశాల. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ స్కూల్ లక్ష్యమని చైర్మన్ విజయ్‌బాబు తెలిపారు. స్కూల్ లక్ష్యం, ప్రాధాన్యతలు, సాధించిన విజయాలు తదితర అంశాలపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవితకు చరిఫరల్ స్కూల్ పునాది లాంటిదియన్నారు. రాష్ట్రంలో ఎన్నో పాఠశాలలు ఉన్నప్పటికీ తమ స్కూల్ ప్రత్యేకత వేరని చెప్పారు. ప్రతి ఏడాదీ ఉత్తమ ఫలితాలను అందిస్తూ ఒక ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. 2016-17లో 52 మంది అభ్యర్థులకు పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించి రికార్డు సృష్టించారన్నారు. నాటి నుంచి ప్రతి ఏడాది ఉత్తమ ఫలితాలు పొందుతున్నామని తెలిపారు 2024 25లో తమ స్కూల్ నుంచి 46 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా నూరు శాతం మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్ మార్కులతో ప్రభంజనం సృష్టించారని తెలిపారు. వారిలో 20 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారన్నారు. మొదటి రెండు, మూడు ర్యాంకులు తమ విద్యార్థులే కైవశం చేసుకున్నారని తెలిపారు. రిఫరల్ స్కూల్ నాణ్యమైన విద్యను అందిస్తుంది అనడానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. చదువే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీసేలా పలు కార్యక్రమాలను తమ పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

పాఠశాలలో అత్యాధునికి ల్యాబ్

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో రిఫరల్ స్కూల్ యాజమాన్యం

:: పాఠశాల ప్రత్యేకతలు ::

- సకల సదుపాయాలతో సువిశాలమైన తరగతి గదులు
- అనుభజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన
- ప్రతి తరగతిలోనూ పరిమిత సంఖ్యలో విద్యార్థులు
- చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక రాయితీ
- 2వ తరగతి నుంచి ఇంటర్నెట్ సదుపాయంతో కంప్యూటర్ శిక్షణ
- అత్యాధునికి కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ ల్యాబులు
- విలువైన పుస్తకాలతో కూడిన సెంట్రల్ లైబ్రరీ
- మల్టీమీడియా ద్వారా ఆకర్షణీయమైన విద్యాబోధన
- విద్యార్థులకు రెసిడెన్షియల్ వైద్యులతో వైద్య సదుపాయం
- మారుమూల ప్రాంతాలకు బస్ సౌకర్యం
- ప్రతి వారం, ప్రతి సబ్జెక్టుపై పరీక్షల నిర్వహణ
- విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో సమావేశాలు
- సువిశాలమైన ఆటస్థలం, యోగా, ఆర్ట్స్, డిబేట్, వ్యాసరచనలో శిక్షణ
- జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

నేరాలు ఘోరాలు

గల్లంతైన రెండో యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానాం బీచ్ లో స్నానం చేసేందుకు సముద్రంలో దిగి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. ఈ సంఘటన లో గల్లంతైన రెండో యువకుడు అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన ఇసుకపట్ల జశ్వంత్(19) మృతదేహాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం అంబాజీపేట మండలం మాచవరం కు చెందిన యాళ్ల హరి కిషోర్(19), అయినవిల్లి మండలం నేదునూరు కి చెందిన ఇసుకపట్ల జశ్వంత్(19) మరో ముగ్గురు నేదునూరుకు చెందిన యువకులు ఎస్.యానం బీచ్‌కు వచ్చి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు యువకుల్లో గల్లంతయిన ఇరువురు అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన యువకుడు యాళ్ల హరి కిషోర్ మృతదేహం మంగళవారం రాత్రి లభ్యమైన విషయం విదితమే. జశ్వంత్ మతదేహాన్ని తహశీల్దార్ వివిఎస్.దివాకర్ సమక్షంలో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రి తరలించి కేసు దర్యాప్తు జరుపుకున్నట్టు ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు.

పత్రాలు లేని 48 ద్విచక్ర వాహనాలు సీజ్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సరైన పత్రాలు లేని 48 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మూలపేట పరిసర ప్రాంతాల్లో పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి ఎస్ఐలు, సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 48 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, 20 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులను గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కొత్త వ్యక్తులు ఇంటి అద్దెకి వస్తే వారి పూర్తి వివరాలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తుని

16వ జాతీయ రహదారిలోని కొండవారిపేట సమీపంలోని పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సిఐ ఎం.గీతారామకృష్ణ సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 40 సంవత్సరాల ఉంటుందని అంచనాకు వచ్చారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతిని శరీరంపై రక్తపు గాయాలు ఏమీ లేవని అన్నారు. రోడ్డు ప్రమాదమా, లేక ప్రమాదవశాత్తు మరణించాడా అనే అంశంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆ వ్యక్తిని ఎవరైనా గుర్తు పడితే 9440796572 నెంబర్‌కు తెలియచేయాలని సూచించారు.

పిచ్చిమొక్కలతో నిండిపోయిన సచివాలయ భవనం

అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయ భవనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో అడవి పుంత రోడ్డు జాతీయ రహదారి అనుకోని గత ప్రభుత్వం సచివాలయ నిర్మాణం చేపట్టింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నిర్మాణంలో చేపట్టిన పిల్లర్స్ బీటలు వారిపోతున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఆ భవనం నేడు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మిగిలిపోయిన నిర్మాణ పనులను చేపట్టి ప్రజాపాలనకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని చదలాడ, కాండ్రకోట గ్రామాల్లో నిర్మించిన సిసి రోడ్లను బుధవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛర్మన్ తుమ్మల బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమణి, ఎంపిడిఒ డి.శ్రీలలిత, కూటమి నాయకులు రాజా సూరిబాబురాజు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, మొయిళ్ళ కృష్ణమూర్తి, తోట రామకృష్ణ, ఒబిలిశెట్టి పెద్దకాపు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకుపోతున్న లతలు

అల్లుకుపోతున్న నిర్లక్ష్యం

ప్రజాశక్తి - జగ్గంపేట

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు విద్యుత్ శాఖ అధికారుల తీరు కన్పిస్తుంది. జగ్గంపేటలో పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు లతలు అల్లుకుపోతున్నాయి. గత కొన్ని నెలలుగా తుప్పలు పెరుగుతున్న వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గ్రామంలోని మంచి నీటి చెరువు గట్టు సమీపంలోని, పద్మనాభనగర్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ తుప్పలు బాగా పెరిగి తీగలను తాకుతున్నాయి. గాలి వేస్తే ఆ వైర్లకు లతలు తగిలి మరమ్మతులకు గురయ్యే పరిస్థితులు నెలకున్నాయి. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో గాలులు వీస్తే ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలు చెలరేగే ప్రమాదం లేకపోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం తుప్పలను శుభ్రపరిచేందుకు విద్యుత్‌కు అంతరాయం కలిగిస్తున్నారు కానీ వీటిని మాత్రం తీయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. తక్షణమే తుప్పలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పద్మనాభనగర్ కాలనీ వాసులు కోరుతున్నారు.

హామీలను అమలు చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు, రౌతులపూడి

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే తన లక్ష్యమని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం ప్రత్తిపాడులో రూ.20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ఆమె ప్రారంభించారు. అనంతరం రాచపల్లిలో ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో ఆమె విత్తనాలు చల్లి, నాగలి చేత పట్టి పొలం దున్ని ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సస్యశ్యామలంగా పంటలు పండించి రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేసిన విత్తనాలు ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ధర్మవరంలో రూ.36 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.10 కోట్లతో నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ రకాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశానన్నారు. నియోజకవర్గంలో ప్రజల పడుతున్న కష్టాలు తెలుసుకుని వారి కష్టాలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్, సత్యంశెట్టి సీతబాబు, యాళ్ళ విశ్వేశ్వరరావు, అమరాది వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రౌతులపూడి మండలంలోని కెపి ట్యాంక్ నుంచి బిబి.పట్నం వెళ్లే రహదారి, ఎల్ఆర్.పాలెం నుంచి జనార్ధనపట్నం గ్రామాలను కలుపుతూ వెళ్లే రహదారుల నిర్మాణాలకు ఎంఎల్ఎ సత్యప్రభ శంకుస్థాపన చేశారు. అనంతరం రౌతులపూడిలో నిర్మించిన సిమెంట్ రహదారులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపిపి భాస్కర్‌బాబు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సాంబశివరావు, టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, ఎంపిడిఒ శివరామకృష్ణయ్య, ఎంపిటిసి సోమరౌతు రవి, మాజీ సర్పంచ్ లాలం అప్పలనాయుడు, అల్లం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నాగలి పట్టి పొలాన్ని దున్నుతున్న ఎంఎల్ఎ సత్యప్రభ

ఆకట్టుకున్న విద్యార్థుల కళారూపాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

సమ్మర క్యాంపు ముగింపు వేడుకలో కోలాటం ఆడుతున్న చిన్నారులు

వేసవి శిబిరం ముగింపు సభలో విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్ర రూపకాన్ని విద్యార్థులు కళాత్మకంగా ప్రదర్శించారు. అలాగే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే నృత్య రూపకం, సావిత్రిబాయి పూలే జీవితం, పల్లె పదాలతో, పల్లె పాటలతో విద్యార్థులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే దేశభక్తి గీతాలు, పర్యావరణ పరిరక్షణ గీతాలను విద్యార్థులు ఆలపించారు. విద్యార్థుల వివిధ వేషధారణల్లో అందరిని ఆకట్టుకున్నారు. సమ్మర్ క్యాంపులో విద్యార్థులు నేర్చుకున్న కరాటే, కర్ర సాము గరిడీ విన్యాసాలు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కళారూపాల నిర్వహణను అంజలి, అనూష, జశ్విత, సందీప్, లోకేష్, తెప్పల యోగేష్, నీలపాల కృష్ణ, అమృత, నమ్రత, బుద్దా శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఈ ముగింపు సభలో ప్రజానాట్యమండలి కళాకారులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, మహపాతిన రాంబాబు, దారపురెడ్డి సత్యనారాయణ బృందం అభ్యుదయ గీతాలను ఆలపించారు.

చందలాడ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - సామర్లకోట


చందలాడ దంపతులను సత్కరిస్తున్న ఎంఎల్ఎ

పట్టణ అభివృద్ధిలో డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం కృషి అభినందనీయమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక పూర్ణా కల్యాణ మండపంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం దంపతులకు పౌర సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్‌గా పట్టణ ప్రజల దాహార్తిని తీర్చి, మున్సిపాలిటీ అభివృద్ధికి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. భీమేశ్వర స్వామి ఆలయం ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా ఆలయ అభివృద్ధికి బాటలు వేశారని గుర్తు చేశారు. అన్నదాతల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వారి అభ్యున్నతికి కషి చేశారన్నారు. డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ డాక్టర్ పద్మనాభం ఏ పదవి నిర్వహించినా ఆ పదవికి వన్నె తెచ్చారని అన్నారు. ఆనంతరం డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం దంపతులకు ఘనంగా పౌర సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజాసూరిబాబు రాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, గుణ్ణం రాజబ్బాయి, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, గోలి వెంకట అప్పారావుచౌదరి, పిట్టా జానకి రామారావు, సరోజ్ వాసు, వైసిపి నాయకులు దవులూరి సుబ్బారావు, మడగల శ్యాం, చీమలకొండ వీరభద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కాలి బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పంచాయతీ ఇబిసి కాలనీకికి చెందిన ప్రజలు తాగునీటి కోసం బుధవారం రోడ్డెక్కి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గత 20 రోజులుగా తాగునీరు పూర్తి స్థాయిలో రాకపోవడంతో నీటి డబ్బాలతో సుమారు 5 కిలోమీటర్లు ప్రయాణించి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గత మూడు నెలలుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొక్కిరిమెట్ల సత్తిరాజు, కోసూరి నాగేశ్వరరావు, యర్రం శెట్టి సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

బిసివై పార్టీకి అనూష యాదవ్ రాజీనామా

ప్రజాశక్తి - కాకినాడ

2024 సార్వత్రిక ఎన్నికలలో కాకినాడ లోకసభ నియోజకవర్గం నుంచి బిసివై పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ అనూషయాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు బుధవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌కు పంపినట్లు ప్రకటించారు. ఎన్నికల అనంతరం ఉన్నత చదువుల నిమిత్తం ఆ పార్టీలో క్రీయాశీలకంగా వ్యవహరించలేకపోతున్నానని, అందుకే పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. తనకు సహకరించిన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్, ఇతర నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యార్థులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు తెరిచిన మొదటి రోజునే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, డిక్షనరీలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ విఆర్‌కె.చౌదరి తెలిపారు. మండల పరిధిలో 79 ప్రభుత్వ, 4 ఎయిడెడ్ పాఠశాలల్లో 7600 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లను అందజేయనున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నాయకుడు తోకల ప్రసాద్

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం

ప్రజాశక్తి - సామర్లకోట

కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్లను రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు తాటిపాక మధు అన్నారు. బుధవారం స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో సిపిఐ 29వ పట్టణ మహాసభ మడగల రమణ అధ్యక్షతన జరిగింది. తొలుత పాత రెవెన్యూ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. పార్టీ పతకాన్ని పార్టీ సీనియర్ నాయకులు కట్ట సత్యనారాయణ ఆవిష్కరించారు. గత మూడేళ్ల కాలంలో మృతి చెందిన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ జూలై 15,16 తేదీలలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ పేద, బడుగు, బలహీన వర్గాల, కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని విమర్శంచారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాచేలా తీసుకొచ్చిన లేబర్ కోడ్డులను రద్దు చేసేంత వరకూ పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, కేశవరపు అప్పలరాజు, ఎఐటియుసి నాయకులు శాఖ రామకృష్ణ, అర్జునరావు, కిషోర్, లక్ష్మి, సూరిబాబు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌ను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణానికి గోదావరి నుంచి సరఫరా చేసే సామర్లకోటలోని సాంబమూర్తి రిజర్వాయర్‌ను కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వేసవిలో చేపట్టాల్సిన మరమ్మతుల కారణంగా గోదావరి కాలువను మూసి వేయటంతో రిజర్వాయర్‌లో నీరు లేదన్నారు. కాలువలోకి ప్రస్తుతం నీటిని విడుదల చేసినా కాలువలో పేరుకుపోయిన చెత్త, బురద, వ్యర్థాలు మూడు రోజులపాటు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున రిజర్వాయర్ నిండిన తర్వాత పట్టణానికి యథావిధిగా నీటిని సరఫరా చేస్తామన్నారు.

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ పంతం నానాజీ

సిసి రోడ్డును ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కరప

మండలంలోని వేలంగి గ్రామంలో నిర్మించిన సిసి రోడ్డును ఎంఎల్ఎ పంతం నానాజీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.8.68 కోట్లతో సిసి రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. తాగునీరు సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.అనుపమ, ఎఇ శైలజ, గ్రామ సర్పంచ్ సవిలే నీలిమ, కూటమి నాయకులు గరగ జిమ్మీ, చంద్రు వెంకన్నరావుచౌదరి, మేడిశెట్టి పట్టాభి, భోగిరెడ్డి కొండబాబు, నున్న గణేష్ నాయుడు, బండారు మురళి, యాళ్ల పండు, సవిలే రాజేష్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఆర్‌ఎఒ మునిస్వామిని కలిసిన నూతన జెఇలు

జెఇ పోస్టులకు ఎంపికైంది వీరే...

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి విద్యుత్ శాఖలో 73 జూనియర్ ఇంజనీర్(జెఇ) పోస్టుల భర్తీకి ఈనెల 8వ తేదీన రాతపరీక్ష నిర్వహించారు. ఈ మేరకు ఈనెల 10 వ తేదీన పరీక్షా ఫలితాలను ప్రకటించారు. యానాం నుంచి ఎంపికైన మెల్లం శరత్‌రాజ్, పంపన జ్యోతినారాయణ, కొల్లు శ్రీనివాసు మర్యాదపూర్వకంగా ఆర్‌ఎఒ మునిస్వామిని బుధవారం కలిశారు. ఆర్‌ఎఒ వీరిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, కొల్లు ప్రసాద్ పాల్గొన్నారు. అదేవిధంగా మద్దింశెట్టి సుభాష్ చంద్ర, కోన వెంకటఅనంతకిరణ్ ఇడబ్ల్యుఎస్ కోటలో ఎంపికయ్యారు.

మాజీ సైనికుల పిల్లలకు సహకారం

ప్రజాశక్తి - యానాం

మాజీ సైనికుల పిల్లల చదువుకు ప్రభుత్వం సహకారం అందిస్తోందని పుదుచ్చేరి సైనిక్ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి యానాం నియోజకవర్గ పరిధిలో మాజీ సైనికుల పిల్లల చదువులకు ట్యూషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాంకు అవసరమైన అలవెన్సును ప్రభుత్వం ఇవ్వనుందని తెలిపారు. దరఖాస్తులను సైనిక్.పివై.జిఒవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని జూలై 27లోపు పంపాలన్నారు. ఆర్‌ఎఒ ఆఫీసు నుంచి దరఖాస్తులను తీసుకోవచ్చన్నారు.

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థి చదువు కోసం రూ.8 వేలు ఆర్థిక సాయం అందించారు. బుధవారం కొప్పుల వెలమ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పప్పల బుజ్జి, యాళ్ళ వీరబాబు, కోశాధికారి అల్లు ప్రసాద్ చేతుల మీదుగా ఈ సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీపురుపల్లి రాజు కుమారుడు తేజ వీరవెంకటసాయి పాలిటెక్నిక్ చదువుతున్నాడని, ఈ విద్యార్థి చదువుకు సంబంధించి సంవత్సరం ఫీజు నిమిత్తం ఈ సాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు చీపురుపల్లి బాబురావు, వెలగల వెంకటరమణ, తైనాల శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కోరంగిలో అటవీ శాఖ అధికారుల పర్యటన

ప్రజాశక్తి - తాళ్లరేవు

అవగాహన కల్పిస్తున్న బీట్ ఆఫీసర్

ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన అటవీశాఖ శిక్షణ అధికారులు బుధవారం కోరంగి అభయారణ్యాన్ని సందర్శించారు. 15 రోజుల క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా పర్యటించిన అధికారులకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ పలు సూచనలు చేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.మహేష్ కోరంగి అభయారణ్యంలోని సంచరించే వన్యప్రాణులు వాటి ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమంల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు కె.సిద్ధార్థ, ఎస్.వీరభద్రరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె.మహేష్, జి.గోపి నాగేంద్రకుమార్, పి.సంధ్యారాణి, సిహెచ్.ధనలక్ష్మి, ఎం.మధుబాబు పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసి తమ్మయ్య మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు మాజీ ఎంపిటిసి సమనాస తమ్మయ్య(62) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. టిడిపి నాయకుడిగా అందరినీ ఆప్యాయతతో పలకరించే తమ్మయ్య మరణం పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా, ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశారు. గత నెల 30న 3వ కుమార్తెకు వివాహ నిశ్చితార్థం జరిగింది. కొద్ది రోజుల్లో వివాహం జరగాల్సి ఉండగా ఆయన మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పూజలు చేస్తున్న విసి చంద్రశేఖర్

భీమేశ్వరస్వామిని దర్శించుకున్న ఎన్‌టిఆర్ యూనివర్సిటీ విసి

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర స్వామిని బుధవారం రాత్రి ఎన్‌టిఆర్ యూనివర్సిటీ విసి డాక్టర్ పి.చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారి దర్శన అనంతరం నంది మండపంలో ఆలయ అధికారులు వారికి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బల్ల నీలకంఠం, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేటలో అంగన్‌వాడీ పిలుస్తోంది

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల వద్ద బుధవారం ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.పూర్ణిమ అధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుతగా 3 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తామని చిన్నారుల తల్లులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సంధ ర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 సంవత్సరాలు నిండిన పిల్లలకు ఆట, పాట, సృజనత్మకంగా చదువును నేర్పిస్తామన్నారు. 5 సంవత్సరాలు నిండిన తరువాత స్కూల్‌కు వెళ్ళుటకు సంసిద్దులు అవుతారని, చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. తదుపరి వారికి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అమ్మాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్, చిన్నారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

వితంతువులకు పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో కొత్తగా 180 మంది వితంతువులకు పింఛన్లు మంజూరు అయ్యాయని ఎంపిడిఒ డి.శ్రీలలిత, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 23 గ్రామాల్లో 142 మంది వితంతువులకు పింఛన్లు మంజూరు కాగా, పట్టణ పరిధిలో 38 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఈ పింఛన్ల అమౌంట్ విడుదలైన వెంటనే లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తామని తెలిపారు.

గర్భిణులకు అన్నదానం చేస్తున్న నిర్వహకులు

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం గర్భిణులకు మన పెద్దాపురం ఫేస్‌బుక్ మాతృత్వం కార్యక్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ట్రినిటీ స్కూల్ పూర్వ విద్యార్థి కీర్తిశేషులు అల్లక సత్యనారాయణ జ్ఞాపకార్థం తన చిన్ననాటి మిత్రులు, ట్రినిటీ స్కూల్ 2011-12 పదవ తరగతి బ్యాచ్ ఆర్థిక సాయంతో అన్నదానంను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళపు అఖిల, అల్లక వీర్రాజు, అల్లక పార్వతి, గ్రూపు సభ్యులు కూనిరెడ్డి రవి, లక్ష్మి, నాగలక్ష్మి, జి.ఉమాశేఖర్, సత్యరాణి, సందీప్, వడ్డి సత్యనారాయణ, ఆనంద్, పి లక్ష్మి పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ నాయకులు

గ్రామ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం, పోలేకుర్రు గ్రామ టిడిపి కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. పి.మల్లవరం గ్రామ కమిటి అధ్యక్షులుగా గుత్తుల వెంకటరమణ తిరిగి ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా దున్నా రాజు ఎన్నికయ్యారు. ఎస్సి సెల్ కార్యదర్శిగా ఉండ్రు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఉంగరాల సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. పోలేకుర్రు గ్రామ కమిటి అధ్యక్షులుగా వడ్లమూరి సతీష్ మరోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సాధనాల వెంకటశివరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా వనమాడి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన ప్రతినిధులను నాయకులు సత్కరించి అభినందించారు. ఎన్నికలను మండల నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, వుంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, జక్కల ప్రసాద్ బాబు, నిమ్మకాయల మూర్తి పర్యవేక్షించారు.

ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయ హుండీలను బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 79 రోజుల కాలంలో హుండీల ఆదాయం రూ.6,26,788లు, అన్నదాన హుండీల ద్వారా రూ.23,226 మొత్తం రూ.6,50,014 ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఈ లెక్కింపులో సామర్లకోట భీమేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి బల్లా నీలకంఠం, విఆర్ఒ జె.లోవలక్ష్మి, మహిళా భక్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KALYANAM YASWANTH,** S/o. Kalyanam Gangadhara Rama Rao, D.No. 3-19, Jamathota Street, Near Venkateswara Temple, Kapavaram, Korukonda, E.G. Distrct, A.P., Pin: 533289, I have changed my name from **KALYANAM Y.P.V.V.N.SESHU** (Old Name) to **KALYANAM YASWANTH** (New Name). Hence forth Iam being called **KALYANAM YASWANTH,** S/o. Gangadhara Rama Rao, for all purpose.

ప్రకటన

తాతపూడి రాణి, W/o. టి.కృపావరం, డోర్ నెం. 3-113, మాదాపురం, ఇసుకపల్లి పోస్ట్‌కు సంబంధించిన కొత్తపల్లి మండలం, పొన్నాడ గ్రామంలో సర్వే నెంబర్ 161/4 లో 0.50 సెంట్లు జిరాయితీ, పల్లం భూమికి సంబంధించి **దాక్యుమెంట్ నెం. 1370071987** నెంబర్ గల పత్రాలు పడిపోవడంతో నఖాల్లు ద్వారా రైతు నేస్తం లోన్ కొరకు మా బ్యాంకును సంప్రదించారు. ఈ డాక్యుమెంట్‌పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోగా సంబంధిత వ్యక్తులు మా బ్రాంచ్‌ని సంప్రదించగలరు.

అడ్రస్:
ది జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్
కాకినాడ, బ్రాంచ్: యు.కొత్తపల్లి

In the Court of the Principal Civil Judge (Junior Division), Kovvur
E.P. No. 64/2024
O.S. No. 196/2021

Between:
భవ్య గ్రాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొవ్వూరు, రిప్రజెంటెడ్ బై its ప్రెసిడెంట్, Palempati V.S.Swaroop ...*DHR/ Plaintiff*
మరియు
శ్రీ నిమ్మల ధన బాలాజీ ...*JDR/Defendant*

To:
JDR/ Defendant:
శ్రీ నిమ్మల ధన బాలాజీ, S/o. సుబ్బారావు, వయస్సు 59, వ్యాపారం, C/o. పోతుల రత్నకుమారి, HP గ్యాస్ కంపెనీ వీధి, కొవ్వూరు, కొవ్వూరు JCJC.

పై నెంబరు గ్రంధములో E.P. No. 64/2024 in O.S. No. 196/2021 లో E.P సంగతులు తెలియజేయు నిమిత్తం JDR/ Defendant కు శ్రీ కోర్టు వారి ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను ఎన్ని పర్యాయాలు నోటీసులు పంపినప్పటికీ JDR/ Defendant బుద్ధి పూర్వకముగా Avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా E.P. No. 64/2024 in O.S. No. 196/2021 లో JDR/ Defendant కు EP సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు EP లో మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల ది. 20-6-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోవచ్చును. లేని యెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా: 20-6-2025

ఆత్కూరి సత్యనారాయణ
DHR/ Plaintiff తరపు అడ్వకేట్
కొవ్వూరు, తూ॥గో॥జిల్లా
సెల్: 9849847197

కొవ్వూరు
ది.08-6-2025